క్లుప్తంగా

నేడు కేసీ గుప్త విగ్రహావిష్కరణ

కోదాడఅర్బన్ : కోదాడలోని హుజూర్‌నగర్ రోడ్డులో ఏర్పాటు చేసిన స్వాతంత్య్ర సమర యోధుడు, వాసవీ మూవ్‌మెంట్ వ్యవస్థాపకుడు కేసీ గుప్త విగ్రహాన్ని ఆదివారం ఉదయం 9 గంటలకు స్థానిక ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆవిష్కరిస్తారని వాసవీ క్లబ్ ప్రతినిధి ఎస్ఎస్‌రావు శనివారం తెలిపారు. ఈ విగ్రహావిష్కరణకు ముఖ్య అతిథిగా వాసవీ క్లబ్ ఉమ్మడి జిల్లా గవర్నర్ వంగవీటి వెంకటగురుమూర్తి, గౌరవ అతిథిగా జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య)లు హాజరవతారని తెలిపారు. ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

మోతె : మండలంలోని రాంపురంతండాకు చెందిన ఓర్సు రాయుడు –దేవి దంపతులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో అనాథలైన వారి పిల్లలకు యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లోని విశాల భారతి ఉన్నత పాఠశాలలో 2000- 2021లో విద్యాసభ్యసించిన విద్యార్థులు ఎస్.గణేష్, బి.లింగారెడ్డి, బి.గణేష్‌లు శనివారం రూ.30 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వీరబాబు, శ్రీ వెంకటేశ్వర విద్యా మందిర్ కరస్పాండెంట్ ఎండీ జానిమియా, సర్పంచ్ నాగునాయక్, రాములు, లఖ్ముడు, ఎంపీటీసీ కవిత, మోహన్, వెంకన్న, లచ్చిరాం, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల జాబితాను బహిర్గతం చేయాలి

కోదాడ : పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో నిర్మించిన 560 డబుల్ బెడ్ రూ ఇళ్లకు గత ఆదివారం నిర్వహించిన డ్రాలో ఇళ్లు దక్కించుకున్న వారి జాబితాను వెంటనే బహిర్గతం చేయాలని కోరుతూ కోదాడకు చెందిన సామాజిక కార్యకర్త కొల్లు వెంకటేశ్వరరావు శనివారం కోదాడ ఆర్డీఓ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లకు వినతిపత్రాలు అందజేశారు. జాబితాను వెల్లడించకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందని, ఎంపికైన వారి జాబితాను ఆర్డీఓ, మున్సిపాలిటీ, తహసీల్దార్ కార్యాలయాల నోటీస్ బోర్డుల్లో ఉంచాలని ఆయన కోరారు.

ఆలయ అభివృద్ధికి రూ.5 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న తంగేళ్లపల్లి విద్యాసాగర్

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్లలో గల వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం అభివృద్ధికి ఆచార్య ఫౌండేషన్ అధినేత డాక్టర్ తంగేళ్లపల్లి విద్యాసాగర్ రూ.5 లక్షల విరాళాన్ని శనివారం ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు తునికపాటి మల్లాచారి, ప్రధాన కార్యదర్శి తుంగతుర్తి జానకిరామచారి, మండోజు సతీష్, ఉద్దోజు శ్రీనివాస్‌చారి తదితరులున్నారు.

గుడిమల్కాపురంలో నేడు సువర్ణలక్ష్మి దాంపత్య వ్రతం

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం గుడిమల్కాపురం గ్రామంలో జ్ఞాన సాయి మందిర వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం భగవాన్ శ్రీ రామదూతస్వామి వారి ఆధ్వర్యంలో శ్రీవేణుదత్త సువర్ణలక్ష్మి దాంపత్య వ్రతం, మహాయాగం, ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి దంపతులతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతున్నారని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

క్రీడా సామగ్రి బహూకరణ


విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న శ్రేయోభిలాష సేవా సంస్థ సభ్యులు

చిలుకూరు : మండలంలోని సీతారాంపురంలోని ప్రాథమిక పాఠశాల, నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు శ్రేయోభిలాష సేవా సంస్థ వారు శనివారం రూ.20 వేల విలువ గల క్రీడా సామగ్రిని బహూకరించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ కన్వీనర్ మడిపడిగె. కుమార్ మాట్లాడుతూ సంస్థ చైర్మన్ విష్ణు జగతి ఆదేశాలతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు క్రీడల్లో రాణించాలనే ఉద్దేశ్యంతో క్రీడా వస్తువులు అందజేసినట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈఓ సలీమ్ షరీఫ్, ప్రధానోపాధ్యాయులు కంచుగంటి వెంకటేశ్వర్లు, తీగెల నరేష్, సర్పంచ్ తమ్మనబోయిన శంకర్, విద్యాకమిటీ చైర్మన్ విజయలక్ష్మి, గ్రామ కార్యదర్శి అవినాష్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు స్వప్న, సంస్థ సభ్యులు అవినాష్‌రెడ్డి, సత్యనారాయణ, ఆంజనేయులు, శశిధర్ పాల్గొన్నారు.

పందులు సంచరిస్తే చర్యలు

హుజూర్‌నగర్ : పట్టణంలో పందులు సంచరిస్తే వాటి యజమానులపై చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. శనివారం హుజూర్‌నగర్ పురపాలక సంఘ పరిధిలో సంచరించే పందులను సిబ్బంది పట్టుకుని పట్టణానికి దూరంగా తరలించి వదిలేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పందుల విహారంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని, వాటిని పట్టణంలోని రాకుండా చూడాలని వాటి యజమానులను హెచ్చరించారు.

ఆదమరిస్తే అంతే సంగతులు!

- ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- తక్కువ ఎత్తులో ఏర్పాటు
- రక్షణ వలయాలు కరువు
- భయాందోళనలో ప్రజలు


కందిబండ శివారులో రోడ్డు పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


వెల్లటూరులో రక్షణ కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

మేళ్లచెరువు : మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డుకు ఆనుకొని, రక్షణ వలయాలు లేకుండా ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కందిబండ గ్రామ శివారులోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉంది. మనుషులు, పశువులకు అందేటట్లు ఏర్పాటు చేశారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు పెంచాలని, రక్షణ కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విద్యుత్ సిబ్బందికి అనేకమార్లు తెలిపినా వారు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. నిత్యం ఈ రోడ్డు మార్గాన అధికారులు ప్రయాణిస్తుంటారని, అయితే ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదరకరంగా ఉందన్న విషయం వారికి తెలిసినా చూసీచూడనట్లు వదిలేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

అధిక లోడ్‌తో విద్యుత్ అంతరాయం..

కాగా, పలు గ్రామాల్లో విద్యుత్ తీగలకు పిచ్చి చెట్లు, తీగలు వంటివి చుట్టుకొని ప్రమాదకరంగా మారాయి. పంట పొలాల్లోని విద్యుత్ తీగలకు సైతం చెట్లు అల్లుకొని తరచూ తీగలు తెగిపోతుండడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, అయినా అధికారులు తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. ఇక మండలంలోని హేమ్లాతండా, కప్పలకుంటతండా గ్రామపంచాయతీల పరిధిలోని విద్యుత్ లైన్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీంతో ఈ పంచాయతీల పరిధిలోని ఎనిమిది తండాలకు కరెంటు సరఫరా నిలిచిపోవడం పరిపాటిగా మారింది. ఏ చిన్నపాటి గాలిదుమారం, వాన జల్లులు వచ్చినా విద్యుత్ నిలిచిపోయి వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆయా తండాలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే సిబ్బంది కాలం చెల్లిన తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతోనే అధిక లోడ్‌తో కరెంటు పోతుందని, దీంతో గంటల తరబడి ఎదురు చూడడం సర్వసాధారణంగా మారింది. ఇక రాత్రి సమయాల్లో సమస్య వస్తే చీకట్లోనే గంటల తరబడి ఉండాల్సి వస్తుందని చెబుతున్నారు. విద్యుత్ అధికారులు పలు గ్రామాల్లో ఏప్పుడో 30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన తీగలు తుప్పుబట్టి తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో విద్యుత్ అంతరాయం నిత్యకృతమవుతోంది. కావునా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, అస్తవ్యస్తంగా ఉన్న వైర్ల సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కంచె ఏర్పాటు చేయాలి



ప్రమాదాలు జగరకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ వెంటనే కంచె ఏర్పాటు చేయాలి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె లేకపోవడంతో విద్యుత్ తీగలకు పశువులు తాకి మృతి చెందుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయాలి.
– ధారావత్ శ్రీను నాయక్, హేమ్లాతండా

పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు


కోదాడ : గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపునిస్తామని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శనివారం అనంతగిరి మండల కేంద్రానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కోదాడలో ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటయ్య, మాజీ సర్పంచ్ వీరయ్య, బాబు, పున్నయ్య, నాగేశ్వరరావు, చార్లెస్ పాల్గొన్నారు.

యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలి

కోదాడఅర్బన్ : మనిషి సంపూర్ణ ఆరోగ్యానికి మార్గం యోగా మాత్రమేనని, ప్రతిఒక్కరూ తమ దినచర్యలో యోగాను భాగం చేసుకోవాలని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. స్థానిక కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినులకు మూడు రోజుల పాటు నిర్వహించే యోగా కార్యక్రమానికి శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు యోగాపై దృష్టి సారించాలన్నారు. కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ మాట్లాడుతూ కళాశాల ప్రాంగణంలో 27వ తేదీ వరకు జరిగే యోగా ఉత్సవాలలో విద్యార్థినులు శిక్షణ పొంది తమ జీవన శైలీ మార్పుకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హార్ట్‌ఫుల్‌నెస్ జోనల్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ, కోదాడ సెంటర్ కోఆర్డినేటర్ వరప్రసాద్, పి.నాగేశ్వరరావు, విజయ్‌కుమార్, నాగార్జునరావు, అధ్యాపకులు, విద్యార్థులు, యోగ అభ్యాసకులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత


పరీక్షా సామగ్రి అందజేస్తున్న రామతులసి

అనంతగిరి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అమీనాబాద్‌లో గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు కొల్లు తులసి పరీక్షా సామగ్రిని శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యేలు సైదిరెడ్డి, మల్లయ్యయాదవ్


ఎమ్మెల్యేల సమక్షంలో నూతన పాలకవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న అధికారులు

హుజూర్‌నగర్ : తెలంగాణలో రైతుల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శనివారం స్థానిక ఏఎంసీ కారాలయంలో జరిగిన హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక మండలి ప్రమాణస్వీకారం కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో రైతులు అన్ని రంగాల్లో ముందున్నారన్నారు. అందుకు సీఎం కేసీఆర్ ఆలోచనా విధానాలు, చేపట్టిన సంక్షేమ పథకాలే కారణమని చెప్పారు. అకాల వర్షాలు వస్తే వెంటనే స్పందించి రైతులకు నష్టపరిహారం అందించి భరోసాగా నిలిచారన్నారు. రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దు చేస్తే కాంగ్రెస్ పార్టీ నాయకుల నుంచి స్పందన లేదని, కానీ వెంటనే స్పందించిన సీఎం కేసీఆర్.. బీజేపీ నిరంకుశ పాలనను ఎండగట్టారని పేర్కొన్నారు. ఎంపీ ఉత్తమ్‌కు ఆయన భార్యకు ఇద్దరికీ టికెట్లు కావాలి కానీ ప్రజాసమస్యలు అవసరం లేదని విమర్శించారు. కానీ మేం ఇద్దరం ఎమ్మెల్యేలం స్థానికులమని మాకు స్థానిక సమస్యలు తెలుసని వాటిని పరిష్కరించడం తెలుసని చెప్పారు. కోర్టు కేసులతో అభివృద్ధిని అడ్డుకోలేరన్నారు.

నూతన పాలక మండలి ప్రమాణస్వీకారం..

ఎమ్మెల్యేలు సైదిరెడ్డి, మల్లయ్యల సమక్షంలో నూతన పాలక మండలి చేత ఉన్నత శ్రేణి కార్యదర్శి కె.సంగయ్య పదవీ స్వీకార ప్రమాణం చేయించారు. చైర్‌పర్సన్‌గా దొంతగాని లక్ష్మమ్మ, వైస్ చైర్మన్‌గా ముడెం రామలింగారెడ్డి, సభ్యులుగా ఎం.బక్షానాయక్, పి.అంజయ్య, వై.రామనర్సమ్మ, ఎస్‌కే.దస్తగిరి, ఎస్.హన్మంతరావు, జె.వెంకటేశ్వర్లు, సీహెచ్.వెంకటేశ్వర్లు, బి.వెంకటయ్య, పి.వీరయ్య, ఎన్.వెంకటేశ్వర్లు, ఎస్‌కే.మతీన్, కె.చిన్నారెడ్డి, పి.రవీందర్‌రెడ్డిలతో పాటు మున్సిపల్ చైర్ పర్సన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, ఏడీఏలతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యేలను, నూతన చైర్‌పర్సన్, మాజీ మున్సిపల్ చైర్మన్‌ను నాయకులు గజమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకారెడ్డి, జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ రంగాచారి, మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ కె.వెంకటరెడ్డి, వివిధ మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే వారి గొంతు నొక్కుతున్న బీజేపీ ప్రభుత్వం


హుజూర్‌నగర్‌లో రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుజూర్‌నగర్ : బీజేపీ ప్రభుత్వం ప్రశ్నించే వారి గొంతు నొక్కుతున్నదని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న, పీసీసీ ప్రతినిధి దొంగరి వెంకటేశ్వర్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ అన్నారు. కాంగ్రెస్ జాతీయ నాయకుడు, ఎంపీ రాహుల్‌గాంధీ సభ్యత్వం రద్దు చేయడంపై శనివారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జునరావు అధ్యక్షతన స్థానిక ఇందిరా సెంటర్‌లో నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించి ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వం రద్దు చేయడం భారతదేశంలో చీకటిరోజని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీకి అండగా యావత్ భారత దేశం నిలుస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తే కక్ష సాధింపు చర్యలు తీసుకోవడం గర్హనీయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రవణ్‌కుమార్, టి.రాజా, కె.సంపత్ రెడ్డి, వి.వీరారెడ్డి, నాయకులు సీహెచ్.వీరారెడ్డి, గల్లా వెంకటేశ్వర్లు, గిరిబాబు, మహేష్, సుబ్బారావు, సత్యనారాయణ, జేఎస్, మల్లయ్య, గురువయ్య, ముక్కంటి, రామ్మూర్తి, రాము, ఎల్.నాగేశ్వరరావు, యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

కోదాడలో కాంగ్రెస్ పార్టీ ధర్నా


కోదాడలో..

కోదాడ : కేంద్ర ప్రభుత్వం అకారణంగా రాహుల్ గాంధీ లోకసభ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ శనివారం కోదాడలోని రంగా థియేటర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా ఇటీవల చేపట్టిన భారత్ జోడోయాత్ర విజయవంతమైందని, దాన్ని చూసి బయపడిన కేంద్రం తప్పుడు కేసులతో రాహుల్ గాంధీని వేధిస్తున్నారని ఆరోపించారు. కేసులకు భయపడేది లేదని, దీనిపై ఎంతవరకైనా పోరాడుతామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వంగవేటి రామారావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ఆవుదొడ్డి ధనమూర్తి, చింతలపాటి శ్రీనివాస్, బాగ్దాద్, నిరంజన్‌రెడ్డి, కాంపాటి శ్రీనివాస్, బాజాన్, సైదానాయక్, పాలూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి


హుజూర్‌నగర్‌రూరల్ : పోషణ్ అభియాన్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ, వైద్య సిబ్బంది


నేరేడుచర్ల : బాలికలకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

హుజూర్‌నగర్‌రూరల్ : గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని లింగగిరిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు టీ3 ఎనిమియాపై వైద్య సిబ్బందితో కలిసి అవగాహన కల్పించి మాట్లాడారు. పోషకాహార లోపాల్ని నివారించుటకు ప్రభుత్వం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ నూర్జహాన్, ఏఎస్ఎం విజయ, పాఠశాల హెచ్ఎం కోటిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం బాగు

గరిడేపల్లి : పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యం బాగుంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి, డాక్టర్ నరేష్ అన్నారు. శనివారం గరిడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హుజూర్‌నగర్ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల నుంచి వైద్య సిబ్బంది రక్తన మూనాలు సేకరించారు. అనంతరం రక్తహీనత బారిన పడకుండా ఉండడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, సీహెచ్.నాగరాణి, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ వై.రాజేష్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు ఉన్నారు.

కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో ఎనిమియా ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం కిశోర బాలికలకు ఇమోగ్లోబిన్ రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఆరీఫ్ మాట్లాడారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత సమస్య రాదన్నారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రావు, వైద్య సిబ్బంది నాగయ్య, నాగరాజు, వరలక్ష్మి, సునీత, మంజుల తదితరులున్నారు.

దిర్శించర్లలో..

మండలంలోని దిర్శించర్లలో పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారులు శనివారం ఇమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం చేతుల శుభ్రతపై అవగాహన కల్పించి విద్యార్థులకు వ్యసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, సర్పంచ్ మాధవి సహకారంతో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, కట్టా మాధవి, ఉపాధ్యాయులు శ్రీదేవి, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్, యాదగిరి, అశోక్‌కుమార్, విజయ్‌కుమార్, కోటిరెడ్డి, సఫీయా, వెంకటకృష్ణ, శంకర్ ఉన్నారు.

పోషణ్ అభియాన్‌పై అవగాహన

నడిగూడెం : పౌష్టికాహారంతో ఆరోగ్యం బాగుంటుందని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యలమర్తి శౌరి అన్నారు. శనివారం సిరిపురం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఎం విజయలక్ష్మి, నిర్మల, శ్రీలక్ష్మి, శైలజ, ఆశ కార్యకర్తలు ఉమ, అరుణమ్మ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

చిలుకూరులో సీపీఎం జనచైతన్య యాత్ర


చిలుకూరులో తమ్మినేని వీరభద్రంకు స్వాగతం పలుకుతున్న సీపీఐ నాయకులు

చిలుకూరు : సీపీఎం చేపట్టిన జనచైతన్య యాత్ర శనివారం చిలుకూరు చేరుకుంది. ఈ సందర్భంగా యాత్రలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, జూలకంటి రంగారెడ్డి, సీపీఎం నాయకులకు స్థానిక సీపీఐ, సీపీఎం నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నాయకులు దొడ్డా నారాయణరావు, బెజవాడ వెంకటేశ్వర్లు, మండవ వెంకటేశ్వర్లు, వేనేపల్లి వెంకటేశ్వర్లు, రెమిడాల రాజు, నాగాటి రాములు, దొడ్డా వెంకటయ్య, సాహెబ్ అలీ, జె.నరసింహారావు, వడ్డేపల్లి కోటేష్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, అంజయ్య, అనంతుల రాము, సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

సారీ చెప్పిన జూలకంటి..

చిలుకూరులో జనచైతన్య యాత్రలో సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతుండగా ఆ గ్రామానికి చెందిన పలువురు అభయాంజనేయస్వామి కండువాలు వేసుకున్న భక్తులు.. కేసీఆర్‌కు మీ పార్టీ మద్దతును ఉపసంహరించుకోవాలని అన్నారు. దీంతో స్పందించిన ఆయన వారి మెడలో ఉన్నవి బీజేపీ కండువాలు అనుకొని రాష్ట్రంలో కాదు, ముందు దేశంలో ప్రధాని మోదీని బొందపెట్టాలని అన్నారు. దీంతో వారు మేము బీజేపీ నాయకులం కాదు అభయాంజనేయస్వామి భక్తులం అని చెప్పగా జూలకంటి నవ్వుకుంటూ వారికి సారీ అని చెప్పారు.

ఆత్మీయ సమ్మేళనం విజయవంతానికి ప్రచారం

నడిగూడెం : మండల పరిధిలోని వల్లాపురంలో ఆదివారం నిర్వహించనున్న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలంటూ చాకిరాల, శ్రీరంగాపురం గ్రామాలలో శనివారం ఎంపీపీ యాతాకుల జ్యోతి ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. నడిగూడెంలో సర్పంచ్ గడ్డం నాగలక్ష్మి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లంజపల్లి నాగేశ్వరరావు, యాతాకుల వీరస్వామి, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ నియంతృత్వ పాలనకు నిదర్శనం

గరిడేపల్లి : రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడం బీజేపీ నియంతృత్వ పాలనకు నిదర్శనమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశ్నించే ప్రతిపక్షాలపై ఒక వైపు ఈడీ దాడులు, మరో వైపు తప్పుడు కేసులను కేంద్రం బనాయిస్తుందని ధ్వజమెత్తారు. రాజ్యాంగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రంపై లౌకిక ప్రజాతంత్రవాదులందరు ఏకం కావాలన్నారు.

భావితరాలకు సారవంతమైన భూమిని అందిద్దాం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ చింత కవిత

కోదాడరూరల్ : వ్యవసాయంలో రసాయనిక ఎరువులను పూర్తిగా తగ్గించి భవిష్యత్ తరాలకు సారవంతమైన భూమిని అందిద్దామని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని గుడిబండ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సేవ్ సాయిల్ పై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. వ్యవసాయంలో రసాయనిక ఎరువులను ఇష్టానుసారంగా వాడటంతో భూమి నిస్సారంగా మారి పంటల దిగుబడి తగ్గడమే కాక తెగుళ్లు తట్టుకోలేని స్థితికి చేరుకుంటుందన్నారు. ఈ సందర్భంగా సేవ్ సాయిల్ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వెంపటి పద్మ, హెచ్ఎం సరిత, ఎస్‌బీఐ మేనేజర్ దినేష్, శరత్ తదితరులు ఉన్నారు.

జనచైతన్య యాత్రను విజయవంతం చేయాలి

నేరేడుచర్ల : నేరేడుచర్లలో ఈనెల 26వ తేదీన జరిగే జనచైతన్య యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు కోరారు. శనివారం ఆయన నేరేడుచర్లలో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె.నగేష్, మండల కార్యదర్శి సిరికొండ శ్రీను, నాయకులు తిరుపతయ్య, మీనయ్య, రామ్మూర్తి, శ్రీనివాస్‌రావు, సైదులు, నగేష్ తదితరులున్నారు.

బీజేపీ ఫాసిస్ట్ విధానాలను ఎండగట్టాలి


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్ : సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14 నుంచి మే 15 వరకు బీజేపీ కో హటావో- దేశ్ కో బచావో, ఇంటింటికి సీపీఐ కార్యక్రమం నిర్వహిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఫాసిస్ట్ విధానాలను ఎండగడుతూనే స్థానిక సమస్యలపై ఉద్యమిస్తామని ఆయన తెలిపారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో తెలంగాణకు రావలసిన అంశాలపై ప్రజల మద్దతుతో కేంద్రంపై ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వై.రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె శ్రీనివాస్, దేవరం మల్లీశ్వరి, పట్టణ కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జె.శ్రీనివాస్, నాయకులు కేవీఎస్ మూర్తి, దొంతగాని, ఎం.వెంకయ్య, ఎస్.కృష్ణ, పి.వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

మునగాల : మండలంలోని ఆకుపాముల శివారులో జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కూలీల కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా కన్వీనర్ అనంతుల సతీష్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు వేర్వేరు ప్రకటనలో డిమాండ్ చేశారు. నడిగూడెం మండలం రామాపురం గ్రామానికి చెందిన పలువురు దినసరి కూలీలు రోజువారి కూలీకి జీఎమ్మార్ సంస్థలో పనిచేస్తున్నారని, విధులు నిర్వర్తిస్తున్న సమయంలో లారీ రూపంలో మృత్యువు వారిని బలిగొన్నదని చెప్పారు. జీఎమ్మార్ సంస్థ మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సమన్వయ లోపంతో తిష్ట వేసిన సమస్యలు

కోదాడఅర్బన్ : కోదాడ మున్సిపాలిటీలో ప్రజాసమస్యలను మున్సిపల్ పాలకవర్గం, అధికారులు గాలికొదిలేశారని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సాతులూరి హనుమంతరావు అన్నారు. శనివారం కోదాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత లేదన్నారు. పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని దీంతో దుర్గంధం వెదజల్లుతుందని అయినా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. రాత్రి వేళల్లో వీధి దీపాలు కూడా వెలగకపోవడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే పలు కాలనీలకు మిషన్ భగీరథ నీళ్లు రాక, బోర్లలో నీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇంటి పన్నులు, నీటి పన్నులు పక్కాగా వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు ప్రజాసమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. పాలకవర్గంలో వర్గపోరు, అధికారులు, పాలకవర్గం సమన్వయ లోపంతో కోదాడలో సమస్యలు తిష్టవేసి ఉన్నాయని తెలిపారు. కోదాడలోని సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే రోడ్లపై ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని అన్నారు.

అనాథ వృద్ధాశ్రమంలో హిజ్రాల అన్నదానం


అన్నదానం నిర్వహిస్తున్న హిజ్రాలు

మునగాల : మండలంలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో శనివారం కోదాడ పట్టణంలోని బంజారా కాలనీకి చెందిన హిజ్రాలు తమ గ్రూపు నాయకురాలైన పవిత్ర నాయకమ్మ పేరు మీద అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, మట్టపల్లి అంజన్న, సురగాని పరుశరాం, బడేటి సాయి, ఉదయ్, హిజ్రాలు మేఘమాల, దివ్య, రాధిక, వైశాలి, శ్రావణి, సంధ్య, ప్రసన్న పాల్గొన్నారు.